సాక్షి నిర్మల్

శుక్రవారం । 24 । మార్చి । 2023



న్యూస్‌రీల్

నిర్మల్ కవులకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దామెర రాములు

నిర్మల్‌టౌన్: ఉగాది పండుగను పురస్కరించుకుని హైదరాబాదులోని రవీంద్రభారతిలో బుధవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో నిర్మల్ కవులకు అరుదైన గౌరవం దక్కింది. జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ దామెర రాములు, కారం శంకర్ సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో టెన్త్ హాల్‌టికెట్స్

నిర్మల్ రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థుల హాల్‌టికెట్లు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ వెబ్‌సైట్ www.bsetelangana.gov.in లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్ విద్యార్థులకు సంబంధించిన హాల్‌టికెట్లు ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు పంపినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల నుంచి విద్యార్థులు వాటిని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్ల జారీలో విద్యార్థులను ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆన్‌లైన్ హాల్‌టికెట్ కూడా పరీక్షకు అనుమతి ఇస్తామని తెలిపారు.

జిల్లాకు చేరుకున్న యూనిఫాం క్లాత్

నిర్మల్ రూరల్: వచ్చే విద్యాసంవత్సరం కోసం విద్యార్థులకు ఉపయోగపడే యూనిఫాం క్లాత్ గురువారం జిల్లాకు చేరుకుంది. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీ, యుఆర్ఎస్, టీఎస్ ఎంఎస్, టీఆర్‌ఈఐఎస్, టీడబ్ల్యూపీఎస్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఈ క్లాత్‌తో యూనిఫాంలు కుట్టించి అందించనున్నారు. దీనిని జిల్లాలోని అన్ని మండలాలకు పంపిస్తామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అందరికీ యూనిఫాం అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రధానోపాధ్యాయులు ఈ క్లాత్ అందుకున్న వెంటనే దర్జీలను సంప్రదించి, కొలతలు తీసుకుని వేసవి సెలవుల్లో కుట్టించాలని సూచించారు.

పాఠశాలల తనిఖీ

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట, గోడిసిర్యాల ప్రభుత్వ పాఠశాలలను డీఈవో రవీందర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివిస్తూ ప్రశ్నలు అడిగారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మరిన్ని జాతీయ అవార్డులు సాధించాలి



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ పద్మ


లక్ష్మణచాంద: మండలంలోని పంచాయతీలు రానున్న కాలంలో మరిన్ని జాతీయ అవార్డులు సాధించాలని, ఇందుకు ప్రజలు సహకరించాలని ఎంపీపీ అడ్వాల పద్మ అన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు వచ్చిన 27 జాతీయ అవార్డులను ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు గురువారం ప్రదానం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఉత్తమ సేవలతోనే గుర్తింపు వస్తుందన్నారు. ఎప్పుడూ ప్రజల మధ్య ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేయాలన్నారు. జాతీయ అవార్డులు పొందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను అభినందించారు. జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రమేశ్, ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పలు కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భీమారావు తెలిపారు. టీఎస్ కేసీ ఆధ్వర్యంలో హెటిరో, పిరమల్ ల్యాబ్ లిమిటెడ్ సంస్థలు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు టీఎస్ కేసీ మెంటార్ బింగివార్ శ్రీనివాస్(9963728452)ను, టీఎస్ కేసీ కో ఆర్డినేటర్ శంకర్ మధుల్కార్ (8374057835)ను, గణిత విభాగ అధిపతి డాక్టర్ అరుణ్(9966998103)ను సంప్రదించాలని సూచించారు.

అక్షరం సాక్షిగా..

- సమస్యలను కళ్లకు కట్టించి..
- పాలకులు, అధికారులను కదిలించి..
- పరిష్కారానికి వారధిగా నిలిచి..
- బాధితుల కన్నీళ్లు తుడిచేలా..
- ఆపన్నహస్తాలు కదిలేలా..
- పదిహేనేళ్లుగా.. ప్రజల పక్షాన



నిర్మల్: సాక్షి.. ప్రతినిత్యం ప్రజలపక్షాన నిలుస్తోంది. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటోంది. జనం బాధను పాలకులు, అధికారుల దాకా చేరుస్తోంది. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అక్షర సమరం చేస్తోంది. ఆపదలో ఉన్నా.. అన్నార్తులు కనిపించినా.. వారికి ఆపన్నహస్తాలు అందే వరకూ తపిస్తోంది. ఏ తోడూ లేనివారికి అక్షరమే అండగా నిలుస్తోంది.. దయార్ద్ర హృదయులను కదిలిస్తోంది. విజయాలు సాధించినా.. విలువలను చాటుకున్నా.. ఆకాశానికెత్తుతోంది. ఎన్నో కుటుంబాల్లో ప్రతీ ఉదయం ఒదిగిపోతోంది. ఎంతోమంది హృదయాల్లో గాఢంగా అల్లుకుపోతోంది. పాఠకుల నిత్య నేస్తంగా మారింది. ఇలా.. ఐదో పదో కాదు.. పదిహేనేళ్లుగా ప్రతినిత్యం శ్రమిస్తూ.. దినదినం కొత్త పాఠకులను తన ఖాతాలో వేసుకుంటూ ప్రజలకు మరింత చేరువవుతోంది.



తుల్జాబాయిని గుర్తించి..

2008.. భైంసాలో ఒక్కసారిగా అల్లర్లు చెలరేగాయి. ప్రజలు రెండువర్గాలుగా విడిపోయారు. ఒకరినొకరు చంపుకునేదాకా వెళ్లారు. అడుగడుగునా పోలీసులు వచ్చేశారు. బయటకు వెళ్తే ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో తుల్జాబాయి ఓ వర్గానికి చెందిన కుటుంబాన్ని మరోవర్గం వారి నుంచి ప్రాణాలతో కాపాడింది. మంటల్లో కాలిపోతున్న ఇంట్లో నుంచి ఓ మహిళ, ముగ్గురు పిల్లలను తీసుకువచ్చి అక్కున చేర్చుకుంది. స్థానికంగా అందరూ 'చిన్నమ్మ'గా పిలుచుకునే తుల్జాబాయి ఆరోజు పెద్దమ్మగా మారింది. ఇదే విషయాన్ని అప్పట్లో 'భైంసాకా బడీకాలా' శీర్షికన ప్రచురించింది. దీనిని చూసిన అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర రెడ్డి రాష్ట్ర అవతరణ వేడుకల్లో తుల్జాబాయిని ప్రత్యేకంగా సన్మానించారు. ఆమె మనుమడికి ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చారు.

'వెలుగు'లోకి తెచ్చి..

'అడవి జంతువులకు బోర్లేస్తరు.. మేమంత కన్నా హీనమా..!' అంటూ తమ గోసపై అధికారులను నిలదీసిన మారుమూల అడవిబిడ్డల గళానికి 'సాక్షి' గొంతుకై రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా అక్షరాయుధాన్ని సంధించింది. అడవి బిడ్డల కష్టాన్ని పాలకులు, అధికారుల కళ్లకు కట్టింది. నీటిచుక్క కోసం 2022, మార్చి 15న పెంబి మండలం చాకిరేవువాసులు నిర్మల్‌దాకా నడిచి వచ్చిన తీరును సాక్షి మెయిన్‌లో కళ్లకట్టింది. అంతకుముందు నాలుగేళ్లుగా వాళ్ల కష్టాలను 'సాక్షి' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. దీంతో నాటి కలెక్టర్ ముషరఫ్‌అలీ, జిల్లా అధికార యంత్రాంగం కదిలి, అటవీగ్రామమైన చాకిరేవు వెళ్లింది. ఆ ఊరికి సోలార్ వెలుగులు, బోర్ల ద్వారా తాగునీళ్లనూ అందించారు. తాజాగా ఉగాది రోజునే 'ఆహా' ఓటీటీ వారు ఇంటింటికీ సోలార్ లైట్లను అందించారు. ఇలా చాకిరేవును 'వెలుగు'లోకి తెచ్చింది 'సాక్షి'.



అక్షరాయుధం..

నిర్మల్ జిల్లాలో 15 ఏళ్లుగా ఎన్నో సమస్యలపై అక్షరాన్ని ఆయుధంగా మార్చి సంధించింది సాక్షి. పరిష్కారానికి వారధిగా మారింది. ఎన్నో కుటుంబాలను నిలబెట్టడమే కాదు, కొన్ని గ్రామాలకు వెలుగులనూ పంచింది. నిర్మల్ ప్రజలకిది కావాలిందే.. అంటూ ప్రజాప్రతినిధులు తెచ్చే దాకా వెంటపడింది. ఒక్కరికి కష్టం వస్తే.. అందరం ఆదుకోవాలంటూ సాయమందేలా చేసింది. ఇలాంటి ఎన్నో ఉదాహరణల్లో ఇక్కడ కొన్ని..

మెడి'కల' నెరవేరేదాకా..

రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా మెడికల్ కాలేజీలను ప్రకటిస్తూ వస్తోంది. గతేడాది ఆగస్టు 6న మూడో విడత కూడా ప్రకటించింది. అందులోనూ నిర్మల్ జిల్లా పేరు లేదు. దీంతో 2022, ఆగస్టు 9న 'మూడో' 'సారీ..' అంటూ 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై సీరియస్‌గా స్పందించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 'సాక్షి' కథనం ప్రచురితమైన రోజే ప్రత్యేక జీవో ద్వారా జిల్లాకు మెడికల్ కాలేజీని మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులిచ్చింది.

'అక్షర'నేస్తంలా..

ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఆపన్నహస్తాలను కదిలించే అక్షరనేస్తంలా 'సాక్షి' ఎన్నో కథనాలను ప్రచురించింది. ఎంతోమంది అభాగ్యుల జీవితాల్లో ఆనందాలను తీసుకురావడంలో సఫలమైంది.

- కూతురమ్మ.. అవును మంచానపడ్డ అమ్మానాన్నలకు ఆ కూతురే అమ్మ. మామడ మండలం దిమ్మదుర్తిలో దయనీయస్థితిలో ఉన్న కుటుంబం, ఆ తల్లిదండ్రులను తన కష్టంతో పోషిస్తున్న బిడ్డ గాథను 2017 ఏప్రిల్‌లో 'కూతురమ్మ' శీర్షికన సాక్షి ఫ్యామిలీ పేజీలో ప్రముఖంగా ప్రచురించింది. అంతే వందలాది ఆపన్నహస్తాలు ఆ కూతురమ్మకు అండగా నిలిచాయి.
- 'బడికెళ్లే వయసులో బరువైన బాధ్యత' అంటూ సారంగపూర్ మండలం జాం గ్రామానికి చెందిన ఓ కుటుంబం గోసను 2021 జూన్ 1న సాక్షి కళ్లకు కట్టించింది. కరోనా కారణంగా తల్లిదండ్రులు చనిపోయి ఒంటరిగా కష్టం మీదపడ్డ ఆడబిడ్డకు ఆర్థికసాయం అందేలా చేసింది. ఇలా ఎంతోమంది ఇబ్బందుల్లో ఉన్నవారికి ఆర్థికసాయమందేలా 'సాక్షి' తనవంతు బాధ్యతను నెరవేర్చింది.

అండర్‌పాస్ నిర్మించేదాకా..

సోన్ మండల కేంద్రంలో నుంచి తమ చేనుల్లోకి వెళ్లేందుకు అండర్‌పాస్ లేకపోవడంతో 44 హైవేపై నుంచే రైతులు వెళ్లేవారు. ఈ క్రమంలో ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. ఒక్క ఊరిలో నుంచే 30 మందికిపైగా చనిపోయారు. నిబంధనల ప్రకారం సోన్ వద్ద 44వ జాతీయ రహదారి కింద అండర్‌పాస్ నిర్మించాలని 'సాక్షి' వరుస కథనాలను రాసింది. ఎట్టకేలకు 2018, అక్టోబర్ 3న ఇక్కడ అండర్‌పాస్ నిర్మాణం ప్రారంభించారు. పుష్‌బాక్స్ విధానంలో రాకపోకలకు ఆటంకం కలుగకుండా ఈ అండర్‌పాస్ నిర్మించారు.

చదువులమ్మచెంత దోపిడీపై..

అక్షర శ్రీకారం చేయించే అమ్మవారి చెంత అడ్డగోలు బిల్లులు పెట్టి దోచుకుంటున్న ఇంటి దొంగలను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. మెయిన్‌పేజీలో 'సరస్వతీ సాక్షిగా దోపిడీపర్వం' పేరిట 2019లో కథనాన్ని ప్రచురించింది. అందులో సాక్ష్యాధారాలతో సహా ఇవ్వడంతో ఏసీబీ విచారణ చేసి, నిజమేనని తేల్చింది. దీంతో ఏళ్లుగా పాతుకుపోయిన ఏఈవో, జూనియర్ అసిస్టెంట్‌తోపాటు పలువురిని దేవాదాయశాఖ సస్పెండ్ చేసింది.





ఇదేం 'భవిత'!

- నిధులు లేక నీరసిస్తున్న కేంద్రాలు
- ఇబ్బంది పడుతున్న దివ్యాంగ విదార్థులు
- పట్టించుకోని అధికారులు



నిర్మల్ పట్టణలో నిర్వహించిన శిబిరానికి హాజరైన దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు(ఫైల్)

లోకేశ్వరం: శారీరక, మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు సేవలు అందించడం, అవసరం మేరకు శస్త్రచికిత్సలు చేసి వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చి కనీస సామర్థ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ కేంద్రాలకు నాలుగేళ్లుగా ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. దీంతో దివ్యాంగ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రాల విద్యుత్ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరాను కట్ చేశారు. కేంద్రాల్లో ఇతర సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

జిల్లాలో 19 కేంద్రాలు..

జిల్లాలో 13 పాత మండలాల్లో భవిత పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇటీవల మరో ఆరు మండలాల్లో భవిత పాఠశాలలను ప్రారంభించారు. 13 భవిత పాఠశాలల్లో కేవలం మూడు (ముథోల్, భైంసా, ఖానాపూర్) కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. మిగతావి ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల్లో 172 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కేంద్రాల్లో సరైనా వసతులు లేక దివ్యాంగ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. లోకేశ్వరం, ఖానాపూర్, భైంసా తదితర పాఠశాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో రెండు నెలల క్రితం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వేసవి కాలం కావడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు కనికరించడం లేదని దివ్యాంగ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో నల్లాలు ఏడాదిగా పని చేయడం లేదు. పైపులు మరమ్మతుకువచ్చి నీరురాక మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని పేర్కొంటున్నారు.

ప్రత్యేక మరుగుదొడ్లు లేక..

జిల్లాలోని భవిత పాఠశాలలు అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఒక్క కేంద్రంలో కూడా తాగునీటి వసతి, ప్రత్యేక మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. దీంతో దివ్యాంగుల విద్యార్థులకు ఒంటికి, రెంటికి బయటకు తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అందని ఉపకరణాలు..

నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నవంబరు 11న సమగ్ర శిక్షణ, విద్యాశాఖ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవ నిర్మాణ సంస్థ సమక్షంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. 305 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరు కాగా, ఇందులో 285 మందికి ఉపకరణాలు అవసరమని గుర్తించారు. ఓ సంస్థ సహకారంతో వీటిని అందిస్తామని అధికారులు ప్రకటించారు. కానీ నేటికీ ఉపకరణాలు అందలేదు.

విద్యను అందిస్తున్నాం



జిల్లాలోని 172 మంది దివ్యాంగ విద్యార్థులకు వివి ధరకాల విద్యను అందిస్తున్నాం. దివ్యాంగుల విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించాలి. వైకల్యం ఆధారంగా ఫిజియోథెరపీ చేయిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, భవిత కేంద్రాల జిల్లా సమన్వయకర్త

నిధులు వచ్చాయి..



భవిత కేంద్రాలకు సంబంధించి నాలుగేళ్ల నిధులు ఇటీవలే విడుదలయ్యాయి. వాటిని ఆయా కేంద్రాల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. పాత పాఠశాలకు రూ.12 వేల చొప్పున, కొత్తగా ఏర్పడిన కేంద్రాలకు రూ.6 వేల చొప్పున మంజూరయ్యాయి. ఈ నిధులతో తాగునీటి వసతి, కరెంటు బిల్లు, ఇతర మరమ్మతుల కోసం ఖర్చు చేయాలి. విద్యుత్ కట్ చేసిన కేంద్రాలకు సరఫరా పునరుద్ధరించేలా చూస్తాం.

– రవీందర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా విద్యాధికారి

ఎండలతో జాగ్రత్త

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, పక్కన ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: వేసవిలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. వేసవి ముందస్తు చర్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి రాబోయే రెండు నెలలు తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గురువారం సమీక్ష నిర్వహించారు. నీటి తీవ్రత ఎక్కువగా ఎక్కడుందో వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ పనులు ఉదయం 6.30 నుంచి 10 గంటల లోపు పూర్తి చేయాలన్నారు. జన సమూహాలు అధికంగా ఉండే ప్రాంతాలతోపాటు గుర్తించిన ప్రదేశాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రతకు గురికా కుండా, వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వడ్డదెబ్బ తగిలినవారికి తక్షణం చికిత్స చేసేలా జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే సమస్య పరిష్కారం అయ్యే వరకూ ట్యాంకర్లతో సరఫరా చేయాలని ఆదేశించారు.

చేపల మార్కెట్ పనులు తనిఖీ

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న చేపల మార్కెట్ పనులను కలెక్టర్ వరుణ్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. గత వారానికి ఇప్పటికీ పురోగతి కనిపించడం లేదన్నారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ సుభాష్‌చందర్ ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



సీపీఆర్ ఎలా చేయాలో చూపిస్తున్న ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్)పై అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు వాళ్ల ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ ఉపయోగపడుతుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆశ వర్కర్స్, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్, మున్సిపల్, అంగన్‌వాడీ, పబ్లిక్ హెల్త్ సెంటర్ సిబ్బందికి లైఫ్ సేవింగ్ టెక్నిక్స్‌పై గురువారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరోనా తర్వాత సడెన్ కార్డిక్ అరెస్ట్ కేసులు పెరిగినట్లు వైద్య నిపుణులు, పలు అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. అందుకే సీఎం కేసీఆర్ సీపీఆర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారన్నారు. అత్యవసర సమయాల్లో పక్కన ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ చాలా ముఖ్యమన్నారు. దీనికోసం కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఎంహెచ్‌వో ధనరాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి

రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో రూ.50 లక్షల వ్యయంతో పునర్నిర్మించే రాధాకృష్ణ ఆలయ పనులను గురువారం ప్రారంభించారు. నిర్మల్ నియోజకవర్గంలో సుమారు 600 పైగా ఆలయాలను నిర్మించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలలు



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేస్తున్నామని, కార్పొరేట్‌కు దీటుగా వాటిని తయారు చేస్తామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన మోడల్ పాఠశాలను గురువారం ప్రారంభించారు. జిల్లాలో 260 పాఠశాలలు మన ఊరు–మన బడి కింద మొదటి విడతకు ఎంపిక చేశామన్నారు. అన్ని పాఠశాలల్లో పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ఇప్పటికే 38 మోడల్ పాఠశాలలను ప్రారంభించామన్నారు. ఈ పాఠశాల్లో 27 లక్షల నిధులతో పనులను చేశామని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, కాంపౌండ్ వాల్, రంగులు, డిజిటల్ బోర్డులు, లైబ్రరీ పుస్తకాలు, ఉపాధ్యాయులకు టేబుల్ కుర్చీలు వంటి ఫర్నిచర్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థుల కోసం లైబ్రరీ కార్నర్‌ను ప్రారంభించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, ఎంఈవో శంకర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సామల రాజేశ్వర్, విద్యాశాఖ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల స్వీకరణ

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుధాకర్ కోరారు. తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో గణితం సబ్జెక్టు బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరి స్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈనెల 26వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 27న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని వెల్లడించారు. వివరాలకు 94937 01939 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గొల్లమాడ యువకుడికి కాంస్య పతకం


ట్రోఫీతో లక్ష్మణ్

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన నాకిడి లక్ష్మణ్ ఈ నెల 15,16,17 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ స్మాష్ రాకెట్ పోటీలలో తెలంగాణ జట్టు తరుపున ప్రతిభ కనబర్చి కాంస్య పతకం గెలుపొందాడు. సదరు యువకుడిని తెలంగాణ స్మాష్ రాకెట్ సెక్రటరీ పులి మధు అభినందించి సన్మానించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

భైంసాటౌన్: అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన గందం ఉత్తమ్ అనే వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ భైంసా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జితిన్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం... హెడ్‌కానిస్టేబుల్ బానోత్ రణజా, పెందూర్ విఠల్‌లు భైంసాలో మున్సిపల్ ఎన్నికల విధులు ముగించుకుని బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తున్నారు. 2014 ఆగస్టు 3న రాత్రి 8.15 గంటల ప్రాంతంలో భైంసా మండలం వానల్‌పాడ్‌కు చెందిన గందం ఉత్తమ్ బైక్‌పై వస్తూ భైంసాలోని విష్ణుప్రకాశ్ ఫ్యాక్టరీ వద్ద వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో బానోత్ రణజా తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. భైంసా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నేరస్తుడు గందం ఉత్తమ్‌కు నాలుగు నెలల సాధారణ జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

గంజాయి విక్రేతలకు మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ కేసులో ఇద్దరు వ్యక్తులకు ఫస్ట్ అడిషనల్ సెషన్ కోర్టు జడ్జి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలానికి చెందిన రాథోడ్ ప్రకాష్, నార్నూర్ మండలం తడిహత్నూర్‌కు చెందిన రాథోడ్ రమేశ్ ఇద్దరు చేనులో గంజాయి పండిచి అధిక డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఇదే ఉద్దేశంతో గంజాయిని తరలిస్తుండగా ఉట్నూర్ బస్టాండ్‌లో ఎస్సై సుబ్బారావు పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. సీఐ నరేశ్ కుమార్ 12 సాక్షులను విచారించి చార్జీషీట్ ఫైల్ చేశారు. కాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్, కోర్టు కానిస్టేబుల్ నరేందర్ 12మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టి నేరం రుజువు చేశారు. దీంతో జడ్జి గురువారం ఇరువురుకి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తానూరు: మండల కేంద్రానికి చెందిన కల్లూరు రాములు(60) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 19వ తేదీన ధర్మాబాద్ రోడ్డులో రాత్రి ఇండియన్ పెట్రోల్ పంప్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని కల్లూరు రాములు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

బేల: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జూనోని గ్రామానికి చెందిన నాగోసే శంకర్ భార్య విద్య (30) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ నయం కాలేదు. దీంతో మానసికంగా కుంగిపోయింది. గురువారం ఉదయం చూసేసరికి వంట గదిలో ఉరేసుకుని కనిపించింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. మృతురాలి తమ్ముడు షిండే రికాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లింగన్న తెలిపారు.

వన్యప్రాణులకు జలసౌకర్యం

- సహజసిద్ధమైన నీటిని అందించేందుకు చర్యలు
- నీటికుంటలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పంపులు వినియోగం
- ఎత్తైన ప్రదేశాల్లో సాసర్ వెల్స్ ఏర్పాటు


ర్యాంప్‌వెల్‌లోని నీటిని తాగుతున్న వన్యప్రాణులు

జన్నారం(ఖానాపూర్): వేసవికాలం సమీపించడంతో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్‌లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అధికారులు చర్యలు మొదలుపెట్టారు. మూగజీవాలకు సహజసిద్ధమైన నీటిని అందించేందుకు పనులు ప్రారంభిస్తున్నారు. నిల్వ ఉన్న నీటితో పాటు సహజసిద్ధమైన జలధారలు, వాగుల్లోని నీటిని వన్యప్రాణులు ఇష్టంగా తాగే అవకాశం ఉంది. దీంతో అడవిలో నీటికి కొరత లేకుండా జలధారలు, నీటి చెలిమలు, వాగుల నీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటితో పాటు నీటికుంటల ద్వారా, ర్యాంప్‌వెల్‌లు, సోలార్ పంపులు, సాసర్ వెల్స్ ద్వారా నీటిని అందించనున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఖానాపూర్, జన్నారం, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అటవీ డివిజన్లలో టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నీటిసౌకర్యంపై అధికారులు దృష్టి సారించారు.

నీటికుంటలపైనే దృష్టి

అటవీ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచడంలో భాగంగా వర్షపునీరు వృథాగా పోకుండా ఉండేందుకు అధికారులు నీటికుంటలపై దృష్టి పెట్టారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో 300 వరకు నీటి కుంటలు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 190 నీటికుంటల్లో నీరు నిల్వ ఉంది. మే మాసం వరకు 80 నీటికుంటల్లో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. కోర్ ఏరియాలో నీటి కుంటలను అధికంగా నిర్మించారు. కురిసిన వర్షాలకు కుంటల్లో నీరుచేరి అందులోనే ఇంకిపోతే భూగర్భజలాలు పెరగడంతో పాటు వన్యప్రాణులకు నీటిసౌకర్యం ఉంటుంది.

సాసర్ వెల్స్ ద్వారా నీటిసౌకర్యం

నీటి కుంటలు, సోలార్ పంపులు, ర్యాంప్‌వెల్స్ లేని ప్రదేశాల్లో ఎత్తైన ప్రాంతంలో సీసీ సాసర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అందులోకి ట్యాంకర్ ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు అందిస్తున్నారు. అయితే గతంలో జన్నారం అటవీ డివిజన్‌లో అత్యధికంగా సాసర్ల ద్వారా నీటిని అందించేవారు. దీంతో ట్రాక్టర్ శబ్దానికి వన్యప్రాణులు భయపడే అవకాశం ఉండడంతో వీటి వినియోగం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో వంద సాసర్‌వెల్స్ ఉండగా ఈ ఏడాది 25 మాత్రమే వినియోగించే అవకాశం ఉంది.

మిషన్ భగీరథ నీరు వినియోగం

అడవిలో నుంచి మిషన్ భగీరథ పైపులు వేస్తున్నారు. దీంతో భగీరథ నీటిని కూడా వన్యప్రాణులకు ఉపయోగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మహ్మదాబాద్, చింతగూడ బీట్‌లలో భగీరథ నీటితో కుంటలు నింపి వాటిని వన్యప్రాణులకు ఉపయోగిస్తున్నారు. జింకల పునరావాస కేంద్రంలో సైతం భగీరథ నీటితో కుంటలు నింపడమే కాకుండా గడ్డి పెంపకం కూడా చేపట్టారు. కన్హ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటన అనంతరం నూతనంగా ఏర్పడ్డ కవ్వాల్ టైగర్ ప్రాజెక్టులో కూడా అభివృద్ధి జరిపి వన్యప్రాణుల సంఖ్య పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వాగులకు ఆనకట్టలు

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కన్హా టైగర్‌జోన్‌లో ఉన్న మాదిరి కవ్వాల్ టైగర్‌జోన్‌లో కూడా వాగులకు ఆనకట్టలు వేసి సహజసిద్ధమైన నీటిని అందించేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రవహించే వాగునీటికి ఆనకట్టలు కడుతున్నారు. వాగునీటికి అడ్డంగా బండ రాళ్లు, ఇసుకతో కట్టకట్టడంతో నీరు నిలిచి చెలిమెలా తయారవుతుంది. పారే నీరు శుభ్రంగా ఉండడంతో వన్యప్రాణులు ఇష్టపడుతాయి. జన్నారం డివిజన్‌లో గతేడాది 30 చోట్ల ఆనకట్టలు కట్టారు. ఈ ఏడాది వాటిసంఖ్య పెంచనున్నారు.


వాగులో ఏర్పాటు చేసిన ఆనకట్ట

ర్యాంప్‌వెల్స్

నీటి ఊటలు ఉన్న ప్రదేశంలో మూడు మీటర్ల లోతు, పది మీటర్ల వెడల్పుతో గుంత తవ్వుతారు. అందులోకి స్వచ్ఛమైన నీరు ఊరడంతో ప్రాణులు తాగేందుకు ఇష్టపడుతాయి. గుంతకు రెండు వైపులా ర్యాంపులు ఏర్పాటు చేయడంతో వన్యప్రాణులు అందులో దిగి నీటిని తాగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ఇలాంటివి 20 వరకు తీసారు. ఈ ఏడాది మరో 25 చోట్ల ర్యాంప్‌వెల్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సోలార్ పంపులు

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో సోలార్ విద్యుత్ ద్వారా నడిచే పంపులతో నీటిసౌకర్యం కల్పిస్తున్నారు. వేసవికాలంలో ఎండల తీవ్రతకు కుంటల్లో నీరు ఇంకిపోయే అవకాశం ఉన్నందువల్ల 18 సోలార్ పంపుల ద్వారా నీటిని వదులుతున్నారు.

నీటిసౌకర్యం కల్పించేందుకు చర్యలు



అడవిలో నివసించే వన్యప్రాణులకు ఆహారంతో పాటు నీటిసౌకర్యం కల్పించేందుకు పలురకాల చర్యలు చేపట్టాం. అడవిలోని వాగుల్లో ప్రవహించే నీటికి ఆనకట్టలు కట్టడం, ర్యాంప్‌వెల్స్ ద్వారా సహజసిద్ధమైన నీటిని అందిస్తున్నాం. ఎత్తైన ప్రాంతాల్లో గుట్టల నుంచి వచ్చే జలధారల నీటిని వినియోగించే ఏర్పాట్లు చేస్తున్నాం.
– సిరిపురం మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

ఆ స్థలం వారిదే...

- 23 ఏళ్ల తర్వాత కోర్టు సంచలన తీర్పు
- రోడ్డు బ్లాక్‌తో నిలిచిన రాకపోకలు


రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేసిన దృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ స్థలం విషయంలో వచ్చిన కోర్టు తీర్పు సంచలనంగా మారింది. సినిమా రోడ్ సమీపంలోని అన్నభావు సాఠే విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయం వైపుగా వెళ్లే రోడ్డుకిరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి ఈ స్థలం తమదేనంటూ గురువారం ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం కలకలం రేపింది. రాణీ సతీజీ కాలనీ సమీపంలోని సాయి పంచవటి హోటల్‌తో పాటు దానిని ఆనుకుని ఉన్న దుకాణాల స్థలం గతంలో సోమా గంగారెడ్డితో పాటు వారికి సంబంధించినదని అతడి తనయుడు సోమ రవి తెలిపారు. రికార్డుల్లో ఈ భూమి తమ పేరిటే ఉందని తెలిపాడు. అయితే ఈ స్థలాన్ని గతంలో ఓ వైద్యుడు ఇతరులకు విక్రయించాడని, దీంతో తాము 23ఏళ్లుగా పోరాడుతున్నామని, తాజాగా ఈ భూమిపై అన్ని హక్కులు సోమ గంగారెడ్డి కుటుంబీకులకే ఉన్నట్లుగా కోర్టు ఇచ్చిందని తెలిపాడు. కోర్టు తీర్పు మేరకు 33 గుంటలతో కూడిన ఈ భూమిని తమ ఆధీనంలోకి తీసుకుని బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నాడు. దీంతో పాటు దిస్ ల్యాండ్ బిలాంగ్స్ టు సోమ గంగారెడ్డి అండ్ అదర్స్ అన్ని ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. దీనిని గమనించిన వాహనదారులు, పాదచారులు, షాపుల నిర్వాహకులు పెద్ద ఎత్తున అక్కడకు తరలివచ్చారు. షాపుల, హోటల్ నిర్వాహకులు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు పడడంతో ఎలాంటి ఘర్షణలు జరుగకుండా ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు ఉదయం నుంచి రాత్రి వరకూ బందోబస్తు చేపట్టారు.

మోదీ పాలనలో నిరుద్యోగం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య


మైక్ కట్‌చేస్తున్న పోలీసులు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య
- జిల్లా కేంద్రానికి జన చైతన్య యాత్ర
- సభను అడ్డుకున్న పోలీసులు
- కాసేపు గందరగోళంగా సభ ప్రాంగణం

నిర్మల్‌టౌన్: 50ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా మోదీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ చేపట్టిన జన చైతన్య యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీరయ్య మాట్లాడారు. దేశమంటే అదాని, అంబానీ సొత్తుగా మార్చేశారన్నరు. గుజరాత్‌లో మోదీ ముఖ్యమంత్రి అయ్యేనాటికి రూ.17వేల కోట్ల ఆస్తులున్న అదాని, మోదీ ముఖ్యమంత్రిగా పదవీ విరమణ చేసిన సమయానికి అతడి ఆస్తుల విలువ రూ.50వేల కోట్లకు పెరిగాయని, అలాగే మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత జాతీయస్థాయిలో ఎదిగిన అదాని ఎనిమిదేళ్లల్లో తన ఆస్తుల విలువ రూ.10లక్షలా 30 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మోదీ, అమిత్‌షా దేశంలో 23కోట్ల మందిని నిరుపేదలుగా చేశారని తెలిపారు. 2014లో 410 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1150 పెరిగిందని మండిపడ్డారు. దేశంలో మోదీ పాలనకు స్వస్తి పలికాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అంతోకొంతో మేలు చేస్తున్న ప్రభుత్వానికి అడ్డుపడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులు అధిక శాతం ఉన్న నిర్మల్ జిల్లాకి గిరిజన విద్యాలయం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆడివయ్య, జయలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు, బాలకష్ణ, అశయ్య, వెంకటేష్, దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్ పాల్గొన్నారు.

సభను అడ్డుకున్న పోలీసులు..

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సభను పోలీసులు అడ్డుకున్నారు. యాత్ర ప్రధాన ప్రచారకర్త రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరయ్య మాట్లాడుతుండగానే పోలీసులు మైక్ కట్ చేయాలన్నారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా వీరయ్య పోలీసులతో వారించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిర్మల్‌లో సాయంత్రం ఐదు గంటల తర్వాత సభ నిర్వహించుకోవాలని డీజీపీ అనుమతి ఇచ్చారని తెలిపారు. అలాంటిది ప్రభుత్వ ఆఫీస్ పక్కనే ఉన్నందున కార్యకలాపాలకు ఆటంకం జరుగుతుందని సాకు చెబుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోలీసులంతా పనిచేస్తున్నారని మండిపడ్డారు. సభను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను కార్యకర్తలు ప్రశ్నించగా కేసులు పెడతామని బెదిరించారని తెలిపారు. అనంతరం పోలీసులను 'సాక్షి' వివరణ కోరగా పక్కనే కలెక్టర్ కార్యాలయంలో సమావేశాలు ఉన్నందునా వారికి నచ్చచెప్పామని, సభలో మైక్ లేకుండా మాట్లాడాలని సూచించామని వివరణ ఇచ్చారు.

భక్తిభావం.. కఠిన ఉపవాసం

- దర్శనమిచ్చిన నెలవంక
- నేటి నుంచే రంజాన్ మాసం
- శుక్రవారం తొలి ఉపవాసం
- నెలరోజుల పాటు దైవ స్మరణే..


బెల్లంపల్లి బాబుక్యాంపులో ముస్తాబైన జామా మసీద్

నెన్నెల(బెల్లంపల్లి): ముస్లింలు అత్యంత పవిత్రంగా కఠోర నియమాలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టే రంజాన్ మాసం నేటి నుంచి షురూ కానుంది. గురువారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ఈ నెల 24న శుక్రవారం తెల్లవారు జామునుంచి మొదటి (రోజా) ఉపవాస దీక్షకు ముస్లింలు సిద్ధమయ్యారు. గురువారం రాత్రి నుంచే మసీదులలో ఖురాన్ పఠనం, తరావి నమాజ్ ప్రారంభమయ్యాయి. ఇందుకు జిల్లాలోని మసీదులను అందంగా ముస్తాబు చేశారు. వేకువ జామున ఉపవాస దీక్ష (సహర్) ప్రారంభించి సాయంత్రం దీక్ష విడిచే సమయం (ఇఫ్తార్) కోసం పట్టణాల్లో ప్రత్యేక వంటకాలు అందించేందుకు హోటళ్లు కూడా సిద్ధమయ్యాయి. ఇలా 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి మళ్లీ సాయంత్రం విలీన గగనంలో నెలవంకను చూసిన మరుసటి రోజు రంజాన్ జరుపుకుంటారు.

అతి పవిత్ర మాసం

ముస్లింల అతి పవిత్ర గ్రంథమైన దివ్య ఖురాన్ దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందని వారు విశ్వసిస్తారు. ఈ నెలలో ఉపవాస దీక్ష ద్వారా శరీరాన్ని సుక్షింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళన అవుతుందని వారి నమ్మం. తద్వారా కామ, క్రోధ, మోహ, మద, మత్సాలు అదుపులో ఉంటాయని నమ్మకం. ఉదయాన్నే అన్నపానీయాలు సేవించడాన్ని సహర్ అంటారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి భోజనాన్ని తీసుకోవడాన్ని ఇఫ్తార్ అంటారు.

30 రోజులను మూడు భాగాలుగా..

రంజాన్ మాసంలో 30 రోజులను మూడు భాగాలుగా విభజిస్తారు. మొదటి పది రోజులు రహమత్‌కే రోజాలు(కరుణ కురిపించే దినాలు), రెండో పది రోజులు మగ్ ఫిరత్‌కే రోజాలు(పాపాల నుంచి క్షమాపణ పొందే దినాలు), చివరి పది రోజులు జహన్నుమ్‌సే ఛుట్కారే రోజాలు(నరకదండన నుంచి విముక్తి కోరే దినాలు)గా పాటిస్తారు.

ప్రత్యేక నమాజ్

ప్రతిరోజు రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్ చేస్తారు. దివ్యఖురాన్‌ను రోజుకు 20 రకాతుల చొప్పున తరావీనమాజ్‌లో 27 రోజుల పాటు హాఫిజ్ పాటిస్తారు. రంజాన్‌లో రాత్రి పూట ఇషా నమాజ్ అనంతరం తరావీనమాజ్ జరుగుతుంది. ఇలా 25 రోజుల తరావీనమాజ్ జరిపిన తర్వాత 26వ రోజు సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈదు ఉల్‌ఫితర్ వరకు ఉపవాస దీక్షను ఆచరిస్తారు. ఇహలోకంలో ఆచరించే కఠోర దీక్షలు మనల్ని పరలోకంలో కాపాడుతాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. రంజాన్ మాసంలో ఉపవాసాలు, ధానధర్మాలతో గడిపిన వారి ప్రార్థనలను అల్లాహ్ ఆలకిస్తాడని, వారి పాపాలు పరిహారమై అగ్నిసంస్కారం పొందిన బంగారం మాదిరి వారి మోము దివ్యకాంతిలో వెలుగుతుందని వారు విశ్వసిస్తారు.

రైతుల పంటను పూర్తిస్థాయిలో కొనాలి


శనగ పంటను పరిశీలిస్తున్న ప్రధాన కార్యదర్శి సుజాత

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌అర్బన్: రైతుల పండించిన పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. గురువారం సాయంత్రం ఆమె స్థానిక మార్కెట్‌ను సందర్శించారు. శనగ కొనుగోలు ప్రారంభించినప్పటికీ గన్నీ బ్యాగులు లేక, సాంకేతిక సమస్యతో కొనుగోలు నిలిచిపోయిందన్నారు. వాతావరణంలో మార్పులు రావడం, అక్కడక్కడ వర్షాలు సైతం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మార్కెట్‌లో రైతులకు కనీస సౌకర్యాలు లేవని, పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతన్నలు రాత్రి నుంచే పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. నీళ్లు, నీడ, భోజనం వంటి కనీస వసతులు సైతం కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. హైబ్రిడ్ రకం వచ్చాక దిగుబడులు పెరిగాయని, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలతో దిగుబడులు పొందేలా రైతులను ప్రోత్సహించాలని, కానీ ఇలా నీరుగార్చేలా ఆరు క్వింటాళ్ల 23 కిలోలు కొనుగోలు చేస్తామనడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని కోరారు. ఆమె వెంట యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్ రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

స్వగ్రామానికి మతిస్థిమితం కోల్పోయిన గల్ఫ్ బాధితుడు


చిన్న రాజన్నను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎన్‌ఆర్‌ఐ బంధువులు

లక్ష్మణచాంద: ఎట్టకేలకు మతిస్థిమితం కోల్పోయి గల్ఫ్ దేశంలోనే ఉండిపోయిన వ్యక్తి స్వగ్రామానికి చేరుకున్నాడు. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన ఏంజలి చిన్న రాజన్న గత పది సంవత్సరాలుగా గల్ఫ్ దేశం ఉపాధి నిమిత్తం వెళ్తున్నాడు. ఏడాది క్రితం ఇంటికి వచ్చి మళ్లీ వెళ్లాడు. అక్కడ పనిచేసే క్రమంలో ఉపాధి కోల్పోయాడు. దీంతో ఇంటికి వచ్చేందుకు చేతిలో డబ్బులు లేకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి అక్కడే తిరుగుతున్నాడు. దీంతో అదే సమయంలో సోన్ మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ హైమద్ గమనించి మతిస్థిమితం లేని వ్యక్తిని చూపి వివరాలు సేకరించాడు. వెంటనే లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యం రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో స్పందించిన సర్పంచ్ ముత్యం రెడ్డి ఎలాగైనా తమ గ్రామవాసిని ఇక్కడకు పంపే ఏర్పాట్లు చేయాలని హైమద్‌ను విజ్ఞప్తి చేశాడు. సర్పంచ్ విజ్ఞప్తితో హైమద్ అక్కడ ప్రభుత్వంతో మాట్లాడి ఎట్టకేలకు గురువారం సాయంత్రం లక్ష్మణచాందలోని చిన్న రాజన్నను తన ఇంటికి చేర్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఎన్‌ఆర్‌ఐ హైమద్‌కు, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శిశువు పాల కోసం ఆవును కొనిచ్చిన అధికారులు


కొనిచ్చిన అవుతో పశువైద్యశాఖ అధికారులు, ఎస్సై

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ మండలం చిచ్‌ధర్‌ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధి గూడ గ్రామానికి చెందిన కోడప పారుబాయి జనవరి 10న రిమ్స్ ఆస్పత్రిలో ఆడ శిశువును ప్రసవించి మృతి చెందింది. తల్లి మృతి చెందగా శిశువు ఆలనాపాలన తండ్రి కోడప జంగుబాపు, కుటుంబ సభ్యులు చూస్తున్నారు. బిడ్డకు పాలు లేక కుటుంబీకులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న పశువైద్యశాఖ డీవీఏహెచ్‌వో కిషన్ గురువారం చిన్నారి కుటుంబ సభ్యులను ఇంద్రవెల్లి మండలకేంద్రానికి రప్పించారు. శిశువుకు అవసరమైన పాల కోసం ఆవు, దూడను కొనుగోలు చేసి వారికి అందించారు. చిన్నారికి ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని తెలిపారు. ముందుగా ఇంద్రవెల్లి ఎస్సై డీ సునీల్‌రాజు గూడ గ్రామాన్ని సందర్శించి చిన్నారికి పాలతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు. చిన్నారికి ఎలాంటి సమస్య వచ్చినా తనకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులను కోరారు. పశువైద్య సిబ్బంది అనిల్ కుమార్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి మృతి

జైనథ్: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జాతీయ రహదారిపై ఐబీ చౌరస్తా వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా వణి తాలుకా బోర్డా గ్రామానికి చెందిన గౌబాడే బాపూరావ్ (60) మృతి చెందాడు. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం... బాపూరావ్ ఉదయం మహారాష్ట్ర నుంచి జైనథ్ మీదుగా బేల మండలంలోని తన మిత్రుడిని కలవడానికి బైక్‌పై బయలుదేరాడు. 10గంటల ప్రాంతంలో ఐబీ చౌరస్తా సమీపానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో అతడి తలకు, కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది చేరుకుని పరిశీలించారు. అప్పటికే బాపూరావ్ మృతి ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించాడు. కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

డీలర్స్ కావలెను

మంచిర్యాల జిల్లా యందు నెలకొల్పిన Roofing Sheets & Link Mesh (కలర్ కోటెడ్ షీట్స్ & లింక్ మెష్) BGI Manufacturing Pvt. Ltd. కంపని కొరకు జిల్లా వ్యాప్తంగా & మండలాల వారిగా "మంచి ఆర్థిక స్తోమత" కలిగి ఏదేని హార్డ్‌వేర్ షాప్ కల్గిన వ్యాపారవేత్తలు కావలెను.

గమనిక: ఆకర్షణీయమైన ఇన్సెంటీవ్‌లు కలవు

సంప్రదించు చిరునామా:

BGI Manufacturing Pvt Ltd
Sy No. 33/8, Sheshapally Shivar, 200 Feet Road, Rajivnagar to Amaravadhi Road, Kyathanpally
Cell: 9885558222, 9063170170

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T.1792]

BUSINESS OFFER

Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్ ✆ 9319814720. [T.1196145]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462